సాక్షి
పెద్దపల్లి

సోమవారం । 28 । జూలై । 2025



ఆదివరాహస్వామికి పూజలు

కమాన్‌పూర్: స్థానిక ఆదివరాహస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. విశేషపూజలు చేశారు.



సహజ కవయిత్రికి పురస్కారం

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన సహజ కవయిత్రి బొమ్మిదేని రాజేశ్వరి తెలంగాణ సారస్వత పరిషత్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారం అందుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా నమోదు అయ్యే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్టేటస్ తెలుసుకోవడమిలా..

జ్యోతినగర్(రామగుండం): కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుదారులు తమకార్డు ఆమోదం పొందిన విషయం తెలుసుకోవడం ఇక సులువే. తెల్లరేషన్ కార్డు మంజూరు అయిందో లేదో తెలుసుకునేందుకు వెబ్‌సైట్ https://epds.telangana.gov.in/FoodSecurityAct/ని క్లిక్ చేయండి. ఆ తర్వాత తొలిఆప్షన్ FSC Search పై క్లిక్ చేయండి. స్క్రీన్‌పై కనిపించే రేషన్ కార్డు సర్చ్ పైక్లిక్ చేయాలి. ఆ తర్వాత FSC Application Search పై క్లిక్ చేయాలి. మీసేవ దరఖాస్తు నంబర్, జిల్లా పేరు నమోదు చేయగానే మీ రేషన్ కార్డు స్టేటస్ గురించిన పూర్తి సమాచారం తెలుస్తుంది.

పొలాలకు బాటలు వేయాలి



వినతిపత్రం అందిస్తున్న భాస్కర్‌రావు

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ పెద్దచెరువు, జూలపల్లి, ముల్కలపల్లి గ్రామాల్లోని పంట పొలాలకు రోడ్లు నిర్మించాలని పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు కోరారు. మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సర్వేయర్ పరీక్ష ప్రశాంతం



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో ఆదివారం లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్ష నిర్వహించారు. రెండు నెలల పాటు శిక్షణ పొందిన 112 మంది అభ్యర్థుల్లో 89 మంది పరీక్షకు హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వేణు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు. పరీక్షల నోడల్ అధికారిగా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటి నోడల్ అధికారిగా రామగిరి తహసీల్దార్ సుమన్, పరిశీలకులుగా పెద్దపల్లి జిల్లా ట్రెజరీ అధికారి కొండ కరుణాకర్, ఇన్‌చార్జి చీఫ్ సూపరింటెండెంట్‌గా బాలనాగమణి వ్యవహరించారు.

బొగ్గు గనుల పరిరక్షణకు పోరు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బొగ్గు పరిశ్రమ, కార్మిక హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఉద్యమాలు చేపడతామని, సింగరేణి కార్మికులు ఇందులో భాగస్వాములు కావాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం బొగ్గు గనుల పరిరక్షణ ప్రచార వాల్‌పోస్టర్‌ను యూనియన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంట్రాక్ట్ హక్కుల పరిరక్షణ కోసం సెప్టంబర్ వరకు చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, వేణుగోపాల్‌రావు, రవీందర్, గట్టు శ్రీనివాస్, రవి, సత్తయ్య, మల్లారెడ్డి, కోటయ్య, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని రంగంపల్లి, ఇండేన్ గ్యాస్ గోదాం, బీసీ హాస్టల్ ఏరియాలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ఇతరత్రా మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జోరుగా వరినాట్లు



నిట్టూరు శివారులో నాటు వేస్తున్న కూలీలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వానలు కురిశాయి. ఆదివారం కాస్త తెరిపిచ్చింది. దీంతో వరి నారు నాటేందుకు ఎదురు చూస్తున్న రైతులు వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. అంతేకాదు.. ఒకవేళ వర్షం కురిసినా కూలీలు తడవకుండా రెయిన్‌కోట్లు ధరించి పొలం మడుల్లో నాట్లు వేస్తూ ఇలా కనిపించారు.

చిగురిస్తున్న ఆశలు

- టెండర్ దశలో ఈఎస్‌ఐ వంద పడకల ఆస్పత్రి
- రెండేళ్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం
- కాంట్రాక్ట్ కార్మికులకు త్వరలోనే మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు
- కేంద్రప్రభుత్వం ప్రకటనతో సర్వత్రా హర్షం



ఎన్టీపీసీలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ కార్యాలయం

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆస్పత్రి టెండర్ దశలో ఉందని వెల్లడించింది. రెండేళ్లలో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించడంతో ఈ ప్రాంతంలోని సంఘటిత, అసంఘటిత కార్మిక రంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

ఉమ్మడి జిల్లా కార్మికులకు ప్రయోజనం..

పెద్దపల్లి జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం పరిశ్రమలతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 20 వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. ఈఎస్‌ఐ వందపడకల ఆస్పత్రి నిర్మిస్తే వీరందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

2018లోనే ఆమోదం..

రామగుండంలో వంద పడకల ఈఎస్‌ఐ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి 2018 సెప్టెంబర్ 20న ఈఎస్‌ఐసీ ఇన్ ప్రిన్సిపల్ ఆమోదం తెలిపిందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. రామగుండం – లింగాపూర్ మధ్యలోని పాత ఈఎస్‌ఐ ఆస్పత్రి స్థలంలో దీనిని నిర్మించనున్నారు. ప్రాజెక్టు ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, ఒప్పందం కుదిరాక నిర్మాణం పూర్తికావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని అధికారులు తెలిపారు.

అందుబాటులోకి వచ్చే సేవలు ఇవే..

ఈఎస్‌ఐ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే.. అనేకమంది వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఐ, డెంటల్, పీడియాట్రిక్స్ వంటి వైద్యసేవలు కార్మికులకు అందనున్నాయి. మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్, సీఎస్ఎస్‌వో, మెడికల్ గ్యాస్ పైపైన్ వంటి ఆధునిక సదుపాయాలూ అందుబాటులోకి వస్తాయి. ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ సేవలు రెండూ అందించనున్నారు. కాగా, వైద్య సిబ్బంది నియామకానికి 2023 డిసెంబర్ 15న జరిగిన 192వ కార్పొరేషన్ సమావేశంలో ఆమోదించిన కొత్త నిబంధనలు అమలులో ఉంటాయని కేంద్రమంత్రిత్వ శాఖ తెలిపింది.

రాజీవ్ రహదారి వెంట నిర్మిస్తే..

గోదావరిఖని ప్రాంతంలోని రాజీవ్ రహదారి సమీపంలోనే ఈఎస్‌ఐ వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తే కార్మికులకు అనేక విధాలుగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి మూసివేసిన పవర్‌హౌస్ ప్రాంతం ఇందుకు పూర్తిగా అనుకూలంగా ఉంటుంద ని అంటున్నారు. రామగుండంలో నిర్మిస్తే రోడ్డు, రవాణా తదితర సౌకర్యాలు ఉండవని పేర్కొంటున్నారు. పైగా గోదావరిఖని, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు మంచిర్యాలలోని కాంట్రాక్టు కార్మికులకూ అందుబాటులో ఉంటుందని వారు వివరిస్తున్నారు.

రవాణా సౌకర్యం ఉండాలి



సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. ఈఎస్‌ఐలో వారికి పూర్తిస్థాయి వైద్యం లభిస్తుంది. అందుకే రాజీవ్ రహదారి వెంట కార్మికులకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలి.

– తుమ్మల రాజారెడ్డి, అధ్యక్షుడు, సీఐటీయూ

సింగరేణి భవనం కేటాయించాలి



మూసి వేసిన సింగరేణి ఆస్పత్రి భవనాన్ని ఈఎస్‌ఐ ఆస్పత్రి కోసం కేటాయించాలి. ఈ విషయంలో సింగరేణి యాజమాన్యంతో మాట్లాడాం. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంతో కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

ప్రతిపాదిత స్థలంలోనే..



ఈఎస్‌ఐకి చెందిన 3.30 ఎకరాల్లోనే వంద పడకల ఆస్పత్రి నిర్మించేలా చూస్తాం. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాం.

– రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

భూమిపూజకు వేళాయె

- నేటినుంచి ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు
- పనులు చేపట్టేందుకు సన్నద్ధమైన లబ్ధిదారులు
- మంచిముహూర్తాలు ఉండడమే కారణమంటున్న పేదలు



సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం నుంచి ముగ్గుపోసే కార్యక్రమాలు చేపట్టేందుకు లబ్ధిదారులు సిద్ధమయ్యారు. మొన్నటివరకు ఆషాఢ మాసం కొనసాగడంతో మంచిముహూర్తాలు లేవని కొందరు ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించలేదు. అయితే, సోమవారం నుంచి అన్నీమంచి రోజులేనని వేదపండితులు సూచించడంతో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులు ముగ్గు పోసేందుకు సిద్ధమవుతున్నారు.

నియోజవర్గానికి 3,500 ఇళ్లు..

జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. లబ్ధిదారులను ఎంపికచేసిన అధికారులు.. ఇటీవల వారికి ప్రొసీడింగ్స్ కూడా అందజేశారు. ఇంటి నిర్మాణ పత్రం అందుకున్న లబ్ధిదారులు 45 రోజుల్లో పనులు ప్రారంభించాల్సి ఉంటుంది.

మూడు విడతల్లో డబ్బులు జమ

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ విస్తీర్ణం 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపే ఉండాలనే నిబంధన ఉంది. ఇంటి నిర్మాణం తొలిదశ నుంచి చివరివరకూ ప్రతీస్థాయి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామని హౌసింగ్ పీడీ రాజేశ్వర్ తెలిపారు. తొలివిడత బేస్మెంట్ స్థాయిలో రూ.లక్ష, రెండోదశ పిల్లర్ స్థాయిలో రూ.లక్ష, మూడోదశలో బిల్డింగ్ స్లాబ్ స్థాయిలో రూ.2 లక్షలు. నాలుగో విడతలో భవన నిర్మాణం పూర్తయ్యాక.. చివరగా రూ.లక్షను లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

అన్నదాతకు కూలీల కొరత



గుంజపడుగు గ్రామ శివారులోని పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు



పత్తి పంట చేనులో వరదనీరు నిలిచి ఎర్రబారుతున్న మొక్కలు

- కలుపుతీత వేళ తీవ్రమైన సమస్య
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

మంథనిలో సాగు వివరాలు(ఎకరాల్లో)	
సాగు అంచనా	8,000
సాగైంది	5,000
ఎర్రబడినది(సుమారు)	50

మంథనిరూరల్: పత్తి సాగు చేసే రైతుకు ఏటా పరేషాన్ తప్పడం లేదు. విత్తనాలు నాటిన తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనడమో.. అవసరానికి మించి వానలు కురువడమో.. లేదా ఇతర పరిస్థితులో తెలియదు కానీ.. పంటలో ఏపుగా పెరుగుతున్న కలుపు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఓ వైపు కూలీల కొరత.. మరోవైపు అవసరాన్ని మించి వానలు పత్తి రైతును ఆగం చేస్తూనే ఉన్నాయి. నాలుగు రోజులపాటు కురిసిన ఎడతెరిపిలేని వానలు కూడా ప్రస్తుతం జిల్లారైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కూలీల కొరతతో..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం పత్తి పంటలో కలుపు పెరుగుతోంది. దానిని తొలగించడం రైతులకు తలకు మించిన భారమవుతోంది. వర్షాకాలంలో కూలీల కొరత వారిని ఆందోళనలకు గురిచేస్తోంది. ఇదే సీజన్‌లో ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు కూలీలు వెళ్తుంటారు. వరినాట్లు సైతం ముమ్మరం అవుతాయి. ఈ క్రమంలో పత్తిలో కలుపు తీసేందుకు కూలీల కొరత ఏర్పడుతూనే ఉంటుంది.

ఇతర ప్రాంతాల నుంచి..

స్థానికంగా కూలీలు దొరకక ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారు. పత్తి పంటలో కలుపు తీస్తే ఒక్కొక్క కూలీకి రోజూ రూ.300 కూలి చెల్లిస్తారు. స్థానికేతర కూలీలను తీసుకొస్తే రవాణా చార్జీలు భరించాల్సి వస్తోంది. ఇది రైతులకు అదనపు ఆర్థిక భారమే.

ముసురువానలతో..

మోతాదులోనే వర్షం కురిస్తేనే పత్తి పంటకు మేలు కలుగుతుంది. అతిగా కురిసినా నష్టమే వస్తుందని అన్నదాతలు అంటున్నారు. నాలుగు రోజులపాటు కురిసిన ముసురుతో జిల్లాలోని అనేక గ్రామాల్లో పత్తి చేనుల్లో వరద నిలిచి చేను జాలువారి పోతోంది. మొక్కలు ఎర్రబారిపోతున్నాయి. రోజుల తరబడి నీళ్లలోనే మొక్క ఉండడం ఇందుకు కారణమని వ్యవసాయాధికారులు అంటున్నారు. కాగా, యాజమాన్య పద్ధతులు పాటిస్తే ముసురు వానల ముప్పు నుంచి పత్తి పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు.

కూలీలు దొరుకుతలేరు



పత్తిలో కలుపు ఏరేందుకు కూలీలు దొరుకతలేదు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాలంటే రవాణా ఖర్చు మీద పడుతంది. నేను ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేసిన. కలుపు బాగా పెరిగింది. కలుపు తీసేందుకు కూలీలు దొరకక ఇబ్బంది అయితాంది.

– తాళ్లపల్లి సత్యవతి, రైతు, గుంజపడుగు

కలుపు పెరిగింది



మేమంతా పత్తి పంట సాగు చేస్తున్నం. కూలీలు దొరకక ఒకరి చేనులో కలుపు తీసిన తర్వాత మరొకరి చేనులో కలుపు తీస్తున్నం. నేను ఎకరంన్నర పత్తి వేసిన. వానలకు కలుపు బాగా పెరిగింది. అందరం కలిసి కలుపు తీసుకుంటానం.

– మూగ రమాదేవి, రైతు, గుంజపడుగు

పంట ఎర్రబడిపోతంది



ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేసిన. నాలుగు రోజులపాటు కురిసిన వానలకు చేనులో అక్కడక్కడా నీళ్లు నిలిచి మొక్కలు ఎర్రబారిపోతున్నయ్. ఎకరాకి రూ.50వేల దాకా పెట్టుబడి పెట్టిన. సుమారు ఎకరంన్నర దాకా ఎర్రబారి పోయేట్టు ఉంది. పెట్టుబడి వస్తదో రాదోనని భయం అయితంది.

– దేవరకొండ బాపు, కౌలు రైతు, పోచమ్మవాడ

ఏకాగ్రతతో చదివి లక్ష్యం అధిగమించాలి



పద్మశాలీ సంఘం పురస్కార సభలో ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి లక్ష్యం అధిగమించాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో పద్మశాలీ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులను ఆదివారం సత్కరించారు. ఎమ్మెల్యే మాటాడుతూ, పద్మశాలీ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామన్నారు. ఆర్డీవో గంగయ్య, అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నీలయ్య, నాయకులు వాసాల రమేశ్, సుధాకర్, రాజేశ్, లక్ష్మీనారాయణ, సదానందం, చందు, బత్తుల రమేశ్, రాయమల్లు పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్ సమీపంలోని ఫిర్దౌస్ మసీదు షాపింగ్ కాంప్లెక్స్‌ను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, నాయకులు జావీద్, ఎంఏ మొయిద్, హాదీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఓదెల(పెద్దపల్లి): పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఆయన ముగ్గు పోశారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా మంజూరు చేశామని తెలిపారు. నాయకులు మూల ప్రేంసాగర్ రెడ్డి, సిరిశేటి రాహుల్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు



శిక్షణ తరగతులు పరిశీలిస్తున్న ఇందిరాబసు

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూలో చేపట్టిన టీసీఎస్ శిక్షణ తరగతులను న్యూ ఢిల్లీకి చెందిన టీసీఎస్ అధిపతి ఇందిరా బసు ఆదివారం పరిశీలించారు. వంద మంది విద్యార్థులకు 20 వారాల పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి ఐటీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. శిక్షణ తీరు, సౌకర్యాలపై ఇందిరా బసు ఆరా తీశారు. ప్రతిభ కలిగిన వంద మందిని ఎంపికచేసి శిక్షణ ఇస్తున్నామని, ప్రతీ శనివారం మౌఖిక తరగతులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. 18 వారాల పాటు లెర్నింగ్ ఇస్తామని, మిగతా రెండు వారాలు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఐటీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి మాట్లాడి సహపంక్తి భోజనం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌కుమార్, టీసీఎస్ ప్రోగ్రాం మేనేజర్ సుబోత్ చంద్ర, సబ్జెక్టు నిపుణులు సిమాంటిసేన్, ఆపరేషన్ లీడర్ వంశీ, ప్రాజెక్టు మేనేజర్ రఘువీర్, బోధకులు రవితేజ, త్రినాథ్, సీఎస్ఈ అధిపతి తిరుపతి, పరిపాలనాధికారి సుమన్ పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలి



వంటల తయారీ పరిశీలిస్తున్న తిరుపతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలని గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ తిరుపతి సూచించారు. భూపతిపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర విద్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టోర్ రూం, తరగతి గదులు ఆయన పరిశీలించారు. భోజనంపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజేశం, సిబ్బంది ఉన్నారు.

బొగ్గు రవాణాపై ప్రత్యేక దృష్టి

- లక్ష్యం మేరకు తరలింపు
- జోరుగా కురుస్తున్న వర్షాలు
- ఓసీపీల్లో ఉత్పత్తి తగ్గే అవకాశం
- మూడు నెలలపాటు ఇదే పరిస్థితి



ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న షావల్



రైల్వే ద్వారా రవాణా అవుతున్న బొగ్గు

సింగరేణిలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు రవాణా(మిలియన్ టన్నుల్లో)		
లక్ష్యం	రవాణా	శాతం
19.23	18.98	98

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం బొగ్గు రవాణాను మరింత వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. బొగ్గు ఉత్పత్తి చేయడం ఒక ఎత్తయితే.. వెలికితీసిన బొగ్గును వినియోగదారులకు సకాలంలో అందించడం మరోటాస్క్‌గా మారుతోంది.

రవాణా లక్ష్యం 70 మిలియన్ టన్నులు

సింగరేణి యాజమాన్యం ఈఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గును రైల్వే మార్గం ద్వారా రవాణా చేయాలని నిర్ణయించింది. సంస్థ సాధించే ఉత్పత్తిలో అత్యధికశాతం రైల్వే మార్గం ద్వారా వినియోగదారులకు చేరవేస్తోంది. ఈక్రమంలో రైల్వే, సింగరేణి మధ్య అనుసంధానంగా ఉండేందుకు రైల్వేట్రాఫిక్ సర్వీస్(ఐఆర్‌టీఎస్) అధికారిగా బి.వెంకన్నను కోల్‌మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా నియమించింది. డిప్యూటేషన్‌పై క్యాబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఈమేరకు ఆమోదించింది. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు.

విద్యుత్ సంస్థలకు అధికంగా..

దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన విద్యుత్ సంస్థలకు సింగరేణి సంస్థ బొగ్గు అందిస్తోంది. దీనిని రైల్వేరేక్‌ల ద్వారా వినియోగదారులకు వేగంగానే సరఫరా చేస్తోంది. ఈక్రమంలో సింగరేణిలో కోల్ మూమెంట్ ఈడీ పోస్టు కీలకంగా మారింది. ప్రస్తుతం సంస్థ వ్యాప్తంగా రవాణా అవుతున్న బొగ్గును రైల్వే ద్వారా అందించడం, రైల్వేతో అనుసంధానంగా ఉంటూ రైల్వే రేక్‌లను కేటాయించాల్సి ఉంటోంది. ఈ పనులన్నీ కోల్‌మూమెంట్ ఈడీ పర్యవేక్షణలోనే కొనసాగుతాయి.

ఈఏడాదిలో 98శాతం రవాణా

సింగరేణి సంస్థ గనుల్లో తవ్వితీసిన బొగ్గులో 98 శాతం బొగ్గును రైల్వే ద్వారా రవాణా చేసింది. ఇప్పటివరకు 19.23 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, 18.98 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసింది. నిర్దేశిత లక్ష్యాల్లో 98శాతంగా నమోదు చేసింది. ఇదే క్రమంలో గతేడాది 19.93 మిలియన్ టన్నులు బొగ్గు రవాణా చేయగా ఈసారి 9.50 లక్షల టన్నులు వెనుకబడింది. గతేడాదికన్నా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు పెంచడం, రవాణాలో గతేడాది కన్నా తగ్గడంపై యాజమాన్యం దృష్టి సారించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా నిర్దేశించగా, 69 మిలియన్ టన్నులు సరఫరా చేసి నిర్దేశిత లక్ష్యాల్లో 95శాతం నమోదు చేసింది.

వర్షాకాలం.. గడ్డుపరిస్థితులు..

సింగరేణి సంస్థలో 80శాతం బొగ్గును ఓసీపీల ద్వారానే ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు(ఓసీపీ)ల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు రవాణా చేయడం కూడా కష్టంగా మారుతుంది. ఈక్రమంలో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సకాలంలో అందించడమే లక్ష్యంగా యాజమాన్యం ముందుకు సాగడం కొంత కష్టంగానే ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఈ సమస్య వర్షాకాలం ముగిసేదాకా.. అంటే.. సుమారు మూడు నెలలపాటు ఉంటుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో వ్యక్తి మృతి

- అంత్యక్రియలకు డబ్బుల్లేక.. దాతల కోసం ఎదురుచూపు



మృతదేహం వద్ద భార్య, కూతుళ్లు

రాయికల్ పేద కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన అంత్యక్రియలకూ చేతిలో చిల్లిగవ్వలేక దాతల కోసం ఎదురుచూస్తోంది ఆ కుటుంబం. పట్టణానికి చెందిన జహంగీర్ (58) కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. భార్య అనసూయ కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. కూతుళ్లు నాగమణి నాగేశ్వరి తల్లికి సేవ చేస్తూ.. చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. తండ్రిని కోల్పోయి.. చేతిలో చిల్లి గవ్వలేని పరిస్థితిలో ఉండడంతో దహన సంస్కారాల కోసం దాతల సహాయం కోసం వేడుకుంటున్నారు. జహంగీర్ కుమారుడు నాగేశ్ గతేడాది హోలీ పండుగ రోజు బావిలో పడి చనిపోయాడు. వారి కుటుంబ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐ అనూప్‌రెడ్డి రూ.పదివేలను ఐకేర్ ఫౌండేషన్ నిర్వాహకుడు రఘుపతి రెడ్డి ద్వారా కుటుంబసభ్యులకు అందించారు. దాతలు స్పందించి నిరుపేద కుటుంబానికి చేయూతనందించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

సిరికొండలో ఒంగోలు వాసి మృతి

- పోలీసుల ఆర్థిక సాయంతో మృతదేహం ఏపీకి తరలింపు

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండలో రోడ్డు పక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తాపీమేస్త్రీ బత్తుల శ్రీనివాస్(60) మృతిచెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా కనిగిరి మండలం మాచవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా సిరికొండలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి రోడ్డుపక్కన మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీనివాస్‌కు స్థానికంగా ఎవరూ లేకపోవడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి సొంత ఖర్చుతో మృతుడి స్వగ్రామానికి వాహనంలో పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ శివారులో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లా చీమన్‌పల్లికి చెందిన భూక్య రాములు, బడావత్ శ్రీహరి ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కోనారావుపేట మండలం మరిమడ్లకు చెందిన రాజు ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు.

ప్రకృతి సేద్యం వైపు రైతుల చూపు

- దేశవాళీ ఆవులు కొంటున్న రైతులు
- ఆవుపేడ, మూత్రంతో పంటల సాగు
- జీవామృతం తయారుచేసి వినియోగం

జగిత్యాలఅగ్రికల్చర్: పంటల సాగులో రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువుల అవసరం లేకుండా.. కేవలం దేశీయ ఆవుల పేడ, మూత్రంతోనే పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన సుభాష్ పాలేకర్ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ.. 'సాక్షి' సాగుబడి అంశాలను ఆకళింపు చేసుకుని అధిక దిగుబడి సాధిస్తున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో రైతులు ఆవులను పెంచుతూ వాటి మూత్రం, పేడను ఉపయోగించి ఖర్చులేని సేద్యం చేస్తూ ఆదాయం పొందుతున్నారు.



ఆవు మూత్రంతో జీవామృతం తయారు చేస్తున్న రైతు రాములు

☛ పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమంటే..

పొలాల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వేయకుండా ప్రకృతి సిద్ధంగా దొరికే వ్యర్థాలతోనే పంటలు పండించడం. ఈ పద్ధతిలో భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు.. వానపాములను వృద్ధి చేయడం ద్వారా అవే పంటలకు అవసరమైన పోషకాలు అందిస్తాయి. దేశవాళీ ఆవుల పేడ, మూత్రంతో జీవామృతం తయారు చేసి చల్లితే అది భూమిలో నిక్షిప్తమై ఉన్న పోషకాలన్నింటిని మొక్కలకు అందిస్తుంది.



దేశవాళీ రకాలను సాగు చేస్తున్న బాపురెడ్డి

☛ వానపాములు పెరుగుతాయి

భూమిలో సూక్ష్మ జీవరాశిని ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందించగల అద్భుత గుణాలు దేశవాళీ ఆవు పేడ, మూత్రంలో పుష్కలంగా ఉంటాయి. ఆవు పేడ, మూత్రాన్ని భూమిలో వేస్తే.. భూమికి గుండెకాయ వంటి వానపాములు, ఇతర సూక్ష్మజీవులు చేరి పంటకు లాభం చేకూరుస్తాయి. భూమిలో ఎక్కువగా దేశవాళీ ఆవుల పేడ వేయడం ద్వారా వానపాములు 24 గంటలు భూమిని గుల్లబరిచి సారవంతం చేస్తుంటాయి. నేల అడుగు నుంచి పోషకాలను పైకి తెచ్చి మొక్కల వేర్లకు అందిస్తుంటాయి. మట్టి, ఇసుకను నిరంతరం తింటూ భూసారాన్ని పెంచుతాయి. మట్టిలో 15 అడుగుల లోతు వరకు వెళ్లి పైకి వస్తూ.. 15 ఏళ్ల పాటు విరామం లేకుండా పనిచేస్తుంటాయి. వాటి సంతతిని ఏడాదికి ఆరు సార్లు వృద్ధి చేసుకుంటాయి. ఒక గ్రాము ఆవుపేడలో 300 కోట్ల నుంచి 500 కోట్ల వరకు భూమికి మేలు చేసూ సూక్ష్మజీవులు ఉంటాయి.

ఒక దేశవాళీ ఆవు ఉంటే చాలు

ఒక్క దేశవాళీ ఆవు ఉంటే ఈ పద్ధతిలో 30 ఎకరాల్లో పంటలు పండించవచ్చు. దేశవాళీ ఆవు ఎండిన పేడలో పోషకాల శాతం పరిశీలిస్తే నత్రజని 1.74 శాతం, ఫాస్పేట్ 1.7 శాతం, పొటాష్ 6 శాతం, కాల్షియం 0.37 శాతం, మెగ్నీషియం 0.53 శాతం, ఫెర్రస్ 1400 పీపీఎం, జింక్ 90 పీపీఎం, మాంగనీస్ 210 పీపీఎం, కాపర్ 71 పీపీఎం, బోరాన్ 5 పీపీఎం ఉంటాయి. ఆవు మూత్రంలో నత్రజని, సల్ఫర్, అమ్మోనియా వాయువు, కాపర్, పొటాష్, మాంగనీస్, యూరియా, ఉప్పు, బెనిఫిషియల్ యాసిడ్, కాల్షియం, నీరు, ఫెర్రస్, యూరిక్ యాసిడ్, పాస్పేట్, సోడియం, కార్బోనిక్ యాసిడ్స్, విటమిన్ ఏ, బీ, సీ, డీ, ఈతోపాటు ఇతర ఖనిజాలు ఉంటాయి. గ్రాము మట్టిలో 100 కోట్ల జీవరాశులు ఉంటాయి. దేశీయ ఆవు పేడ, మూత్రం వాడడంద్వారా భూమిలో జీవరాశులను పెంపొందించుకోవచ్చు.

☛ పంటలకు పోషకాలుగా..

ప్రస్తుతం ఆవు పేడ, మూత్రానికి విలువ పెరిగింది. దేశవాళీ ఆవు మూత్రాన్ని కూడా కొనుగోలు చేస్తున్నారు. ఆవులు పెంచే రైతులు ఆవు మూత్రాన్ని వృథా కానివ్వకుండా షెడ్లలోనే కుండీల్లోకి చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆవు మూత్రం, పేడతో పంటలకు ఉపయోగపడే జీవామృతం, ఘనామృతం, పంచగవ్య, నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, ఇసుక యూరియా, దశపత్ర కషాయం, పులిసిన పండ్ల రసం ద్రావణాలు తయారు చేసుకుని పంటలకు తెగుళ్లు, పురుగులు రాకుండా చూసుకోవడంతోపాటు పంటలకు అవసరమైన పోషకాలను వీటి ద్వారా అందిస్తున్నారు.

కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయం



కొన్నేళ్లుగా వరి, మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. మంచి ఫలితాలు వస్తున్నాయి. బియ్యాన్ని నేరుగా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. మామిడికాయను సేంద్రియ ఉత్పత్తుల స్టాళ్ల వారు కొనుగోలు చేస్తున్నారు.

– మిట్టపల్లి రాములు, తుంగూర్, బీర్‌పూర్

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గింది

15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నాను. ఈ పద్ధతులతో భూమి ఆరోగ్యంగా ఉండటంతోపాటు పంట ఉత్పత్తులతో మనిషి ఆరోగ్యం కూడా బాగా ఉంటుంది. నా పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకే అమ్ముతున్నాను.

– ఎన్నం బాపురెడ్డి, జైనా, ధర్మపురి

అర్బన్ బ్యాంకులో అవినీతి?

- గత పాలకవర్గాల తీరుపై అనుమానాలు
- నిగ్గు తేలుస్తానంటున్న బ్యాంకు పీఐసీ చైర్మన్
- ఉప్పు.. నిప్పులా వ్యవహారం



వాయిదా పడటంతో వెళ్లిపోతున్న సభ్యులు

కరీంనగర్ అర్బన్: అర్బన్ బ్యాంకులో అవినీతి చోటు చేసుకుందా.. సభ్యత్వాలు బోగసేనా, బ్యాంకు ఆదాయాన్ని హారతికర్పూరంలా కరిగించేశారా.. అంటే అవుననే సమాధానమొస్తోంది. ఆదివారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన సహకార అర్బన్ బ్యాంకు మహాజన సర్వసభ్య సమావేశంలో చోటుచేసుకున్న పరిణామాలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. రూ.కోట్ల సొమ్ము పక్కదారి పట్టిందని, అక్రమార్కులను వదిలేదిలేదని బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ప్రకటించడం పాలకవర్గ అక్రమాలను చాటుతోంది. సహకార అర్బన్ బ్యాంకును గాడినపెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పడం ఏ స్థాయిలో అక్రమం చోటుచేసుకుందో త్వరలోనే తేలనుంది.

అసలేం జరిగింది

బ్యాంకు బైలా ప్రకారం 1965 కోపరేటివ్ యాక్ట్ ప్రకారం ఎవరైతే బ్యాంకులో ఖాతాదారుడు ఉంటే అతనికే సభ్యత్వం ఇవ్వాల్సి ఉంటుంది. గత పాలకవర్గాలు అడ్డగోలుగా సభ్యత్వమిచ్చాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సభ్యత్వం ఇచ్చి సమర్థించుకునేందుకు 2009లో బైలాను మార్చారు. 2007 నుంచి 2017వరకు కమిటీ అనేక అవకతవకలకు పాల్పడ్డారు. సభ్యత్వ లెడ్జర్‌లో ఒకరి పేరు తీసివేసి వేరొకరి పేరు చేర్చారు. సదరు విషయంలో సహకార అధికారులు విచారణ జరిపి 380మంది సభ్యుల పేర్లు దిద్దినట్టు గుర్తించగా సస్పెన్స్ బుక్ మాయం చేయడం గుర్తించారు. నకిలీ బంగారంతో బినామీలకు లోన్లు ఇచ్చినట్లు తేలగా ఓ అధికారిని సస్పెండ్ చేయగా లోన్ అమౌంట్ రికవరీ చేయకపోగా ఇన్సూరెన్స్ అప్లై చేయలేదు. సదరు వ్యవహారం నిగ్గు తేల్చేందుకు పీఐసీ చైర్మన్ విలాస్‌రెడ్డి పక్షం రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. సదరు అడ్రస్‌లో లేరని కొంతమంది నోటీసులను తిరస్కరించారు. ఈ క్రమంలో ఆ వ్యవహారంపై చర్య తీసుకోవాలంటే సర్వసభ్య సమావేశం తప్పనిసరి.

కోరం లేదని వాయిదాలపై ఒత్తిడి

నకిలీ బంగారంతో లోన్ వ్యవహారం బయటపడుతుందనే సమావేశం కానివ్వడంలేదని విలాస్‌రెడ్డి వాదన. కమిటీ నిర్ణయం తీసుకొని సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే అక్రమాలకు పాల్పడినవారి సభ్యత్వాలు తొలగించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పలువురు సహకార అధికారులపై ఒత్తిడి చేసి కోరం లేదనే నెపంతో సమావేశాన్ని వాయిదా వేయించారని తెలుస్తోంది. కాగా 2007 నుండి 2017వరకు దాదాపు 20 సర్వసభ్య సమావేశాలు జరగగా ఏ సమావేశంలోనూ 50నుంచి 100మంది మించలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడింది. ఆదివారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ప్రకటించారు. ఆగస్టు 3న రెవెన్యూ గార్డెన్‌లో బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

చర్యల నుంచి తప్పించుకునేందుకే



2009లో కళాభారతిలో సమావేశం నిర్వహించగా 1,780మంది హాజరైనట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అక్కడ సిట్టింగ్ కెపాసిటీ కేవలం 250. మరీ 1,780 మంది ఎక్కడ కూర్చున్నట్లు. ఒక్క సమావేశంలోనూ కోరం ఉండాలన్న నిబంధన పాటించలేదు. ఇప్పుడు కోరం అంటూ కొత్త రాగం పాడుతున్నారు. బ్యాంకు సంక్షేమం కోసం కాకుండా స్వార్థ ప్రయోజనాల కోసమే బ్యాంకును వాడుకున్నారు. ఆగస్టు 3న జరిగే సమావేశంలో అన్నీ బయటపెడుతాం. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని వదలను.

– గడ్డం విలాస్‌రెడ్డి, అర్బన్ బ్యాంకు పీఐసీ చైర్మన్

తండ్రికి కూడు పెట్టని కొడుకులు

- ఆస్తి లాక్కుని ఆదరించడం లేదు
- భార్య మృతి .. రోడ్డు పాలైన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు
- న్యాయం చేయాలంటున్న బాధితుడు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): శరీరంలో సత్తువ ఉన్నంతకాలం సింగరేణిలో ఉద్యోగం చేశాడు.. కన్న కొడుకులను పెంచి, పోషించి, ప్రయోజకులను చేశాడు.. అప్పటిదాకా సంపాదించిన అంతోఇంతో ఆస్తిని పిల్లలకు ఇచ్చేశాడు.. ఉద్యోగ విరమణ తర్వాత శరీరంలో సత్తువ కోల్పోయాడు. భార్య కూడా విడిచి వెళ్లింది.. ఆస్తిపంచుకున్న కొడుకులు కూడు పెట్టకపోవడంతో రోడ్డున పడ్డాడు ఆ వృద్ధుడు.. గుడి.. బడి.. బస్టాండ్‌లో తలదాచుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు మూల రాజయ్య(75). బాధితుడి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి చెందిన రాజయ్య గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేసి గతంలోనే ఉద్యోగ విరమణ పొందాడు. అనంతరం స్వగ్రామానికి చేరుకున్నాడు. భార్య ఐలమ్మతో కలిసి తనకు వచ్చే రూ.16 వేల పింఛన్‌తో బతుకున్నాడు. అయితే, భార్య అనారోగంతో ఇటీవల మృతి చెందింది. వీరికి రవి, సదానందం, కృష్ణ కుమారులు. ఇందులో రెండో కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. రాజన్న అంతకు ముందే తన ఆస్తిని ముగ్గురు కొడుకులకు సమానంగా పంచి ఇచ్చాడు. అయితే, భార్య మృతితో అతడి పరిస్థితి రోడ్డున పడింది. కొడుకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ఆకలి తీర్చుకోవడం కోసం హోటళ్లలో భోజనం తింటున్నాడు. బడి, గుడి, బ స్టాండ్‌లో తలదాచుకుంటున్నాడు. వృద్ధాప్యంలో తనకు సపర్యలు చేసే కొడుకులు, కొడవళ్లు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని పోలీసులకు, రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు రాజయ్య మొర పెట్టుకున్నాడు.



న్యాయం చేయాలని వేడుకుంటున్న రాజయ్య

టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మోతిరాం తెలిపిన వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన ఉడుగుల సురేందర్ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో రాచర్లబొప్పాపూర్ వైపునకు వస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ యజమాని సురేందర్, డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్

మద్యానికి బానిసై ఆత్మహత్య

వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన ఊట్ల పవన్‌కల్యాణ్(25) మద్యానికి బానిసై ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పవన్‌కల్యాణ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద టెంట్‌హౌజ్ పనులు చేసేవాడు. నెల రోజులుగా ఏ పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఎన్నిసార్లు తల్లి రాజమ్మ చెప్పినా వినకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..

చొప్పదండి: పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఎనగందుల లక్ష్మణ్(65) అనారోగ్య సమస్యలతో తన ఇంట్లో శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మణ్ ప్రైవేటు పాఠశాల డ్రైవర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. మృతుని భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జల్సాలకు అలవాటుపడి.. ఈజీ మనీ కోసం

- గంజాయి విక్రయంలో యువకుడు
- రూ.21లక్షల గంజాయి పట్టివేత
- నిందితుడి అరెస్టు : డీసీపీ కరుణాకర్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

పెద్దపల్లిరూరల్: జల్సాలకు అలవాటుపడి, అందుకు అవసరమైన డబ్బును సులభంగా సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయిస్తున్న ములుగు జిల్లా ధర్మారావుపేటకు చెందిన అంగడి సాంబయ్యను ఆదివారం అరెస్టు చేసినట్లు పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ తెలిపారు. ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. బిల్డింగ్ సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగించే సాంబయ్య.. ఒడిశాకు చెందిన రమేశ్‌తో కలిసి ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసేవాడు. ఆటో ఇంజిన్ దిగువన ప్యాక్ చేసి మంచిర్యాల ఏరియాకు తీసుకొచ్చేవాడు. అక్కడ అధిక ధరకు విక్రయించేవాడు. ఈక్రమంలో అందిన సమాచారంతో అంగడి సాంబయ్య మంచిర్యాలకు ఆటోలో వెళ్తుండగా.. పెద్దపల్లి శివారులోని రైల్వే వంతెన వద్ద పోలీసులు శనివారం తనిఖీ చేశారు. సాంబయ్య వద్ద 41.88 కిలోల గంజాయి లభించగా, గంజాయితోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, నరేశ్, కోటేశ్వర్, హెడ్‌కానిస్టేబుళ్లు అనంతరెడ్డి, స్వామి, సిబ్బంది ప్రభాకర్, సతీశ్, రాజు, అనిల్‌కుమార్‌ను డీసీపీ అభినందించారు.

అన్నవరం దేవేందర్‌కు సినారె పురస్కారం

కరీంనగర్‌కల్చరల్: యాదాద్రి– భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సినారె సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. తెలంగాణలో పాత పది జిల్లాల్లోని పదిమంది కవులను ఎంపిక చేసి పురస్కారాలు ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎంపికైన అన్నవరం దేవేందర్ పురస్కారం అందుకున్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, తెలంగాణ సరస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య పాల్గొన్నారు.



సినారె పురస్కారం అందుకుంటున్న అన్నవరం దేవేందర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మూడురోజులుగా కురుస్తున్న వానలకు మతిస్థిమితం సరిగా లేని గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయాడు. చలికి గజగజ వణికిపోతున్న వ్యక్తిని చూసిన ఓ మానవతావాది పోలీసులకు, అధికారులకు సమాచారం అందించి మానవత్వం చాటుకున్నాడు. ముస్తాబాద్ శివారులో సిద్దిపేట రహదారిలో మడేలేశ్వర ఆలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్లపొదల్లో ఆదివారం ఉండగా, ముస్తాబాద్ రజక సంఘం అధ్యక్షుడు శేరయ్య గమనించాడు. రెండుదుప్పట్లు తీసుకువచ్చి చలికి వణుకుతున్న వ్యక్తికి సపర్యలు చేశాడు. పంచాయతీ, పోలీస్, 108 అధికారులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, 108 సిబ్బంది అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి ఒంటిపై నల్లని నిక్కర్ మాత్రమే ఉందని ఎస్సై గణేశ్ తెలిపారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుందని, కుడి చెంపపై పుట్టుమచ్చ ఉందన్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల మార్చురీలో భద్రపరిచామని, వివరాలకు 87126 56371 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- కూతురు ఇంటికి వెళ్లేక్రమంలో రైలు ఢీ
- అక్కడికక్కడే చనిపోయిన మహిళ

రామగుండం: 'శుభకార్యానికి వెళ్దాం అమ్మా... త్వరగా రెడీ అయి రా' అని కూతురు ఫోన్‌చేసి చెప్పిన కొద్దిసేపటికే రైలు ఢీకొని సిరిశెట్టి లక్ష్మి(62) దుర్మరణం పాలైంది. రామగుండం జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి కథనం ప్రకారం.. కుందనపల్లి ఐవోసీ ఇందిరమ్మకాలనీలో లక్ష్మి నివాసం ఉంటోంది. కుందనపల్లి ఊళ్లో నివాసం ఉండే ఆమె కూతురు బండిపెల్లి స్వరూప.. శుభకార్యానికి వెళ్దామని, తన ఇంటికి రావాలని తల్లి లక్ష్మికి ఫోన్ చేసింది. పట్టుచీర కట్టుకొని కూతురు ఇంటికి బయలుదేరిన లక్ష్మి.. మూసిఉన్న కుందనపల్లి రైల్వేగేట్ కిందనుంచి దూరి ముందుకు వెళ్తోంది. ఈ సమయంలోనే చెన్నై నుంచి న్యూఢిల్లీ వైపు వెళ్తున్న తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆమెను ఢీకొనడంతో దుర్మరణం చెందింది. ఆమెకు వినికిడి లోపం ఉంది. రైలు వస్తుందని, గేటు దాటి వెళ్ల కూడదని అక్కడి వాహనదారులు మొత్తుకున్నా వినపడక ప్రమాదం బారినపడింది. కూతవేటు దూరంలోనే కూతురు ఇల్లు ఉండడం, క్షణాల్లో మృతి సమాచారం తెలియడంతో ఆమె కుప్పకూలింది. మృతురాలి భర్త నారాయణగౌడ్ అనారోగ్యంతో ఉండడంతో లక్ష్మి సపర్యలు చేస్తోంది. నారాయణగౌడ్ – లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరందరూ వివాహితులే. ఇద్దరు కూతుళ్లు కుందనపల్లిలోనే నివాసం ఉంటున్నారు. చిన్నకూతురు హైదరాబాద్‌లో ఉంటోంది. రెండోకూతురు పొన్నం పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ముగిసిన సీబీఎస్ఈ కబడ్డీ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని వివేకానంద సీబీఎస్ఈ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ 7 కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్ 14 విభాగంలో శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్, పాయకరావుపేట (ఆంధ్రప్రదేశ్) విజేతగా నిలిచింది. వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి ద్వితీయస్థానం, సూర్యచంద్ర ప్యాలస్ స్కూల్, వనపర్తి (తెలంగాణ), శ్రీ విద్యాపీఠ్ నార్కెట్‌పల్లి (తెలంగాణ) జట్లు తరువాతస్థానంలో నిలిచాయి. అండర్–17 విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి (ఆంధ్రప్రదేశ్) ప్రథమస్థానం, శ్రీ విద్యాపీఠ నార్కట్‌పల్లి స్కూల్ (తెలంగాణ) ద్వితీయస్థానం, సూర్యచంద్ర ప్యాలస్ స్కూల్, వనపర్తి (తెలంగాణ), ఎస్.ఆర్ విద్యానికేతన్ గద్వాల్ (తెలంగాణ) జట్లు తరువాత స్థానాల్లో నిలిచాయి. అండర్–19 విభాగంలో ప్రథమస్థానాన్ని శ్రీ ప్రకాష్ విద్యపీఠం, పాయకరావుపేట (ఆంధ్రప్రదేశ్) కైవసం చేసుకోగా ద్వితీయ స్థానాన్ని సిస్టర్ నివేదిత స్కూల్, హైదరాబాద్ (తెలంగాణ), తృతీయ స్థానాలను వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి (ఆంధ్రప్రదేశ్), హిల్స్ హై స్కూల్ నర్సింగపాలెంట(ఆంధ్రప్రదేశ్) జట్లు కైవసం చేసుకున్నాయి. కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.అమిత్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.సంపత్‌రావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ టి.లలితా కుమారి విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు ప్రథమస్థానంలో నిలిచిన జట్లకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ.8వేలు, తృతీయస్థానాలకు రూ.5వేల చొప్పున నగదు పురస్కారం అందించారు. కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం గౌడ్, రెఫరీ బోర్డు చైర్మన్ లక్ష్మీనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ రేణుక, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత్, హెచ్ఎం.అనిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిత్తరంజన్ పాల్గొన్నారు.



అండర్-19 విజేతగా నిలిచిన శ్రీ ప్రకాశ్ స్కూల్ (పాయకరావుపేట, ఆంధ్రప్రదేశ్)

కొండగట్టు అంజన్నకు పంచామృతాభిషేకం

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేటలోని శ్రీకొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ సప్తాహంలో భాగంగా స్వామివారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. మూలవిరాట్టుకు ఫల, పంచామృతాలతో అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీవేంకటేశ్వర స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారికి సర్వభూపాల వాహన సేవ నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్టు



దీపాలు వెలిగించి.. మొక్కులు చెల్లించి

వేములవాడ: ఐదురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఆదివారం గెరువు ఇవ్వడం, శ్రావణమాసం ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసి కోడె మొక్కులు, కుంకుమపూజలు, దీపొంతల్లో నూనె, గండాదీపంలో నూనె పోసి మొక్కుకున్నారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

